క్లుప్తంగా

విజయవంతంగా అంతర్వేది ఉత్సవాలు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహ స్వామివారి వార్షిక దివ్య తిరు కల్యాణ మహోత్సవాలకు పది రోజుల్లో 5 లక్షల మంది భక్తులు వచ్చారని అమలాపురం ఆర్డీఓ కె.మాధవి తెలిపారు. గురువారం అంతర్వేది రెవెన్యూ గెస్ట్ హౌస్‌లో ఆమె రామచంద్రపురం ఆర్డీఓ అఖిలతో కలసి మీడియాతో మాట్లాడారు. ఉత్సవాల చివరి రోజున 20 వేల మంది భక్తులు స్వామిని దర్శించుకున్నా రన్నారు. ప్రధాన ఘట్టాల్లో గతంలో చోటు చేసుకున్న సమస్యలను అధిగమించినట్టు వివరించారు. కలెక్టర్ పర్యవేక్షణలో జిల్లా స్థాయి అధికారుల సమన్వయంతో ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించినట్టు తెలిపారు. కాగా శుక్రవారం అంతర్వేదిలో ప్రధానమైన శాఖల ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించి, డాక్యుమెంటేషన్ చేసి, తగిన రివ్యూ ఇస్తామని చెప్పారు.

ఆర్థిక సాయం పంపిణీ



నందంపూడిలో సత్యవతికి సాయం అందజేస్తున్న ముత్తాబత్తుల కుటుంబ సభ్యులు

అంబాజీపేట: అమలాపురం కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నందంపూడి గ్రామానికి చెందిన ముత్తాబత్తుల ఆనందరావుకు ముత్తాబత్తుల కుటుంబ సభ్యులు ఆర్థిక సాయాన్ని గురువారం అందజేశారు. వైద్యం చేయించుకుంటానికి ఆనందరావుకు ఆర్థిక స్తోమత లేకపోవడంతో ముత్తాబత్తుల కుటుంబ సభ్యులు స్పందించి రూ.26 వేలను అతని భార్య సత్యవతికి ఇచ్చారు. కార్యక్రమంలో ముత్తాబత్తుల వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, వీరవెంకట సత్యనారాయణ, శ్రీను, గంగాధర్, తులసీదాస్, శ్రీమనరాజు, ఎల్ఐసీ ఆనందరావు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

వైభవంగా అమ్మవార్ల జాతర



మగటపల్లి జాతరలో పూజ ఘటం ఊరేగింపు

మామిడికుదురు: మగటపల్లి గ్రామ దేవతలు శ్రీధనమ్మ, వనువులమ్మ వార్ల జాతర మహోత్సవం బుధవారం రాత్రి ఘనంగా జరిగింది. చిత్ర, విచిత్ర వేషధారణలు, గరగ నృత్యాలు, పూజ ఘటం నడుమ జాతర మహోత్సవాన్ని వైభవంగా జరిపించారు. గురువారం భక్తులు అమ్మవార్లను దర్శించుకుని ముడుపులు, మొక్కుబడులు సమర్పించారు. జాతర మహోత్సవాల సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో పాటు పలు రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. 16వ తేదీ వరకూ అమ్మవార్ల జాతర మహోత్సవం జరుగుతుందని ఆలయ కమిటీ పేర్కొంది.

నేడు విద్యుత్ అంతరాయం

మామిడికుదురు: నగరం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామని ఆ శాఖ అమలాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రాంబాబు గురువారం తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ సరఫరా ఉండదన్నారు. పాత స్తంభాలను తొలగించి కొత్తవి ఏర్పాటు చేస్తుండడంతో పాశర్లపూడి, పాశర్లపూడిబాడవ, బి.దొడ్డవరం, పెదపట్నంలంక, పాశర్లపూడిలంక, బాడిలంక గ్రామాలకు సరఫరా నిలిపి వేస్తామన్నారు.

ఆలమూరు: మండలంలోని చొప్పెల్ల, ఆలమూరు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం పలు గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని రామచంద్రపురం ఈఈ కె.రత్నాలరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా పినపళ్ల, పెదపళ్ల, నర్సిపూడి, నవాబుపేట, గుమ్మిలేరు, మోదుకూరు, పెనికేరు, కలవచర్ల, ఆలమూరు, జొన్నాడ, మూలస్థాన అగ్రహారం, మడికి, చెముడులంక, చొప్పెల్ల తదితర గ్రామాల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటలకు వరకూ సరఫరా ఉండదన్నారు.

గ్యాస్ స్టౌ వితరణ

ఆలమూరు: చింతలూరు ప్రాథమిక పాఠశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకానికి గ్యాస్ స్టౌను గ్రామానికి చెందిన కడలి శ్రీనాగ మోహనసాయి మణికంఠ, పిల్లి శంకరం అందించారు. దీనిని హెచ్ఎం ఉడతా వెంకటేశ్వరరావు, వాసా నాగవీర దుర్గాప్రసాద్‌కు ఇచ్చారు.

19న వాహనాలకు వేలం

అయినవిల్లి: చాలా కాలంగా వాహన యజమానులు పట్టుకెళ్లకుండా స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఉన్న నాలుగు మోటార్ సైకిళ్లు, ఓ ట్రక్కు ఆటోకు తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మ ఆధ్వర్యంలో ఈ నెల 19న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఎస్సై కె.మనోహర్‌జోషి గురువారం తెలిపారు.

విజయమే లక్ష్యంగా పనిచేయాలి

ఆలమూరు: ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ఆలమూరులో మండల టీడీపీ సమావేశంలో ఆయన మాట్లాడారు.

మామిడికుదురు: ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖర్‌కు మద్దతుగా రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ఎన్నికల ప్రచారం చేశారు.

కష్టాల ఊరు.. కంటనీరు

- కుళాయిలున్నా జలం రాదు
- అక్రమ మోటార్లే కారణం
- అధికారుల చర్యలు శూన్యం



రామరాజులంక మెయిన్‌లో తాగునీటి కోసం మహిళల పాట్లు

మలికిపురం: ఎండ మండుతోంది.. వేసవి సమీపిస్తోంది.. గుక్కెడు నీళ్ల దొరకడం కష్టంగా మారింది. మలికిపురం మండలంలో మేజర్ పంచాయతీ అయిన రామరాజులంకలో పరిస్థితి చేయిదాటింది. గ్రామంలో సుమారు 12 వేల పైబడి జనాభా ఉంది. ప్రధానంగా రామరాజులంక గ్రామ మెయిన్, పెదతిప్ప వాసుల తాగునీటి కష్టాలు వర్ణనాతీతమయ్యాయి. ఈ గ్రామంలోని పెదతిప్పలో 40 వేల లీటర్ల సామర్థ్యం ఉన్న ట్యాంకుకు పూర్తి స్థాయిలో నీరందడం లేదు. ఇక్కడ రోజుకు 10 నిమిషాలు కూడా కుళాయిల నుంచి నీరు రావడం లేదు. అది కూడా ఆ కుళాయిల వద్ద ప్రజలు గోతులు తీసుకుని బిందె నింపుకోవాల్సిందే. గ్రామ మెయిన్‌లో లక్షా 62 వేల లీటర్ల సామర్థ్యం ఉన్న ట్యాంకు ఉన్నప్పటికీ సుమారు ఆరు వేల జనాభా ఇక్కడే ఉన్నారు. వర్షాకాలంలోనే ఇక్కడ సరిగా నీరుండదు. కొంత కాలంగా కుళాయిల నుంచి గుక్కెడు నీరు కూడా రావడం లేదు. ఒక్కోసారి సాయంత్రం వేళ కుళాయి నుంచి నీరొస్తుందంటే బిందెలతో పరుగెత్తి వెళ్లే సరికి ఆగిపోతుంది. ఇదండీ గ్రామంలోని ఊచ కాలువ గట్టు ప్రజల దీనస్థితి. పట్టించుకునే నాథుడే లేక ప్రజల అష్టకష్టాలు పడుతున్నారు. ఇక రామరాజులంక బాడవ పరిస్థితి మరీ దారుణం. సుమారు వంద కుటుంబాలు బాడవలోనే నివసిస్తున్నాయి. గ్రామంలో తాగునీటి సమస్యకు ప్రధాన కారణం పంపింగ్ చేసే పైప్‌లైన్‌కు ఈ గ్రామం శివారులో ఉండడం, మరోకటి అక్రమ కుళాయిలు. ఈ గ్రామంలోని మెయిన్‌లో లక్షా 62 వేల లీటర్ల సామర్థ్యం గల ట్యాంకుకు గుడిమెళ్లంక ప్రధాన రిజర్వాయర్ నుంచి పంపింగ్ జరుగుతోంది. సుమారు 10 కిలో మీటర్ల దూరం ఉన్న ఈ పైప్‌లైన్‌లో మధ్యలో సుమారు నాలుగు గ్రామాల ట్యాంకులు ఉన్నాయి. శివారులో ఈ గ్రామం ఉంది. పైగా శివారుకు వచ్చేసరికి ఒత్తిడి తగ్గి ట్యాంకులోనికి నీరు ఎక్కడం లేదు. దీనికి తోడు అక్రమ కుళాయిలు, వాటికి మోటార్లు బిగించి నీటిని తోడేస్తున్నారు. ఫలితంగా సాధారణ ప్రజలకు బిందెడు నీరు దొరకడం కష్టం అవుతుంది. ఇదే విషయాన్ని గ్రామస్తులు అధికారులతో పదే పదే చెబుతున్నా స్పందన శూన్యం. ఈ సమస్య పరిష్కారానికి నేరుగా గుడిమెళ్లంక నుంచి రామరాజులంక గ్రామానికి ప్రత్యేక పైపులైన్ వేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. అలాగే అక్రమ కుళాయిలు, మోటార్లు తొలగింపు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అలాగే గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి బాడవతో పాటు, మెయిన్ ప్రాంతాల్లో రెండు అదనపు ట్యాంకులు నిర్మిస్తే కొంత వరకూ సమస్య పరిష్కారం అవుతుందని చెబుతున్నారు. ఇక గ్రామంలోని చర్చిపేటలో 40 వేల లీటర్లు, గండిపేటలో 30 వేల, ముద్దలవారి మెరకలో 30 వేల లీటర్ల సామర్థ్యం ఉన్న ట్యాంకులు ఉన్నా నీరు అందడం లేదు.

అధికారంలో ఉన్నా..

ఈ గ్రామంలో జనసేనకు బలం ఉంది. దీంతో సుమారు నాలుగేళ్ల కిందట ఆ పార్టీ నేతలంతా జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ను గ్రామంలో ప్రతి వీధికీ తిప్పారు. ఆ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ఆరు నెలలుగా తాగునీటి సమస్య విలయ తాండవం చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. సమస్య పరిష్కరించాలంటూ మూడు నెలల కిందట గ్రామంలోని మహిళలంతా పంచాయతీకి తాళం కూడా వేశారు. అయినా పరిస్థితిలో మార్పు రాలేదు. అక్రమ కుళాయిలు, పైప్‌లైన్లకు మోటార్లు వినియోగమే కారణమని ఆ పార్టీ కార్యకర్తలే బోరుమంటున్నారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఫలితం ఉండడం లేదు



తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యకు గల కారణాలను అధికారులు గుర్తించినా పరిష్కారానికి చర్యలు తీసుకోవడం లేదు. పంచాయతీ ప్రతి సమావేశంలో ఇదే చర్చ జరుగుతుంది. అయినా ఫలితం ఉండడం లేదు.

–నల్లి శివకుమార్, పెదతిప్ప, రామరాజులంక

రాజకీయ ఒత్తిడి వల్లే..



రామరాజులంకలో తాగునీటి సమస్యకు కారణాలను గుర్తించాం. అక్రమ మోటార్లు వినియోగం వల్ల ఇబ్బందులు వస్తున్నాయి. వాటిని తొలగిస్తున్నా తిరిగి వేస్తున్నారు. రాజకీయ ఒత్తిడి కూడా ఉండడం వల్ల ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది.

–కాకర శ్రీనివాస్, సర్పంచ్

మాజీ సీఎం జగన్‌ను కలసిన జగ్గిరెడ్డి



మాజీ సీఎం జగన్‌ను కలసిన మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి, జెడ్పీటీసీ రమాదేవి



మాజీ ఎంపీ సురేష్‌ను సత్కరిస్తున్న రామారావు

కొత్తపేట: మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ చిర్ల జగ్గిరెడ్డి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. గురువారం కొత్తపేట జెడ్పీటీసీ సభ్యురాలు గూడపాటి రమాదేవి, మండల పార్టీ సేవాదళ్ అధ్యక్షుడు గూడపాటి ప్రవీణ్‌కుమార్ (జీపీ)లతో కలసి జగన్‌ను ఆయన నివాసంలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో స్థితిగతులు, పార్టీ అభివృద్ధి గురించి చర్చించారు. ఉత్సాహంగా పనిచేయాలని జగన్ సూచించారు.

మాజీ ఎంపీని కలసిన నాయకులు

అయినవిల్లి: బాపట్ల మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు నందిగం సురేష్‌ను బాపట్ల ఉదండరాయునిపాలెంలో ఆ పార్టీ జిల్లా సీనియర్ నాయకులు, అంబాజీపేట వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ మాజీ డైరెక్టర్ చేట్ల రామారావు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్ప గుచ్ఛం అందజేశారు. రామారావు వెంట మానేపల్లి ఉప సర్పంచ్, పి.గన్నవరం మండల పార్టీ ప్రధాన కార్యదర్శి ఉండ్రాజవరపు దుర్గారావు, మండల వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు కొండేటి నాని బాబు, జిల్లా ఐటీ విభాగం జాయింట్ సెక్రటరీ పెదపూడి రత్నరాజు ఉన్నారు. ఈ సందర్భంగా నందిగం సురేష్ మాట్లాడుతూ తిరిగి వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు.

వైఎస్సార్ సీపీలో కార్యకర్తలకు సముచిత స్థానం



మాట్లాడుతున్న మాజీ మంత్రి సూర్యారావు

మలికిపురం: వైఎస్సార్ సీపీలో కష్టపడిన ప్రతి కార్యకర్తకూ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సముచిత స్థానం కల్పిస్తున్నారని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. మలికిపురం పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో ప్రతి కార్యకర్త పార్టీ అభివృద్ధి కోసం పని చేయాలని సూచించారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని కోరారు. కార్యకర్తలకు ఎటువంటి కష్టం వచ్చినా పార్టీ అండగా ఉంటుందని అన్నారు. ఇటీవల నియోజకవర్గంలో పార్టీ సుమారు 60 మంది కార్యకర్తలకు వివిధ పదవులను ఇచ్చిందని, వారందరినీ ఈ నెల 15వ తేదీన మలికిపురంలో సమావేశపరిచి బాధ్యతలను అప్పగిస్తామన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తుందన్నారు. ప్రజల కోసమే పరితపించే జగన్ కూటమి మోసాలను ఎండగడుతున్నారన్నారు. కూటమి అరాచక పాలన అంతమయ్యే వరకూ జగన్‌కు అండగా ప్రతి కార్యకర్త ఉండాలన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు కటకంశెట్టి ఆదిత్య కుమార్, కుసుమ చంద్రశేఖర్, కట్టా శ్రీనివాసరావు, కూనపరెడ్డి రాంబాబు, సూరిశెట్టి బాబి, నల్లి రక్షణ, బొలిశెట్టి భగవాన్, తాడి సహదేవ్, అడబాల జానకీరామ్ తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి



కొత్తపేటలో వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ ప్రదీప్తి, ఎస్సై సురేంద్ర

కొత్తపేట: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు విధిగా పాటించాలని, లేకుంటే చర్యలు తప్పవని ట్రైనీ డీఎస్పీ పి.ప్రదీప్తి హెచ్చరించారు. జిల్లా ఎస్పీ కృష్ణారావు ఆదేశాల మేరకు డీఎస్పీ సుంకర మురళీ మోహన్ పర్యవేక్షణలో ట్రైనీ డీఎస్పీ ప్రదీప్తి ఆధ్వర్యంలో ఎస్ఐ జి.సురేంద్ర గురువారం మారుతి సెంటర్ తదితర ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఇందులో భాగంగా నిబంధనలు పాటించకుండా ద్విచక్ర వాహనాలు నడుపుతున్న వారిని ఆపి కౌన్సెలింగ్ ఇచ్చారు. నంబర్ ప్లేట్ లేకుండా డ్రైవింగ్ చేస్తున్న వాహనాలను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. ద్విచక్ర వాహనాలపై ప్రయాణాలు చేసేటప్పుడు తప్పనిసరిగా వాహనం రికార్డు, డ్రైవింగ్ లైసెన్స్, నంబర్ ప్లేట్లు, హెల్మెట్ కలిగి ఉండాలన్నారు. అలా లేకుండా వాహనాలు డ్రైవ్ చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. హెల్మెట్ ధారణలో నిర్లక్ష్యం చేయరాదని డీఎస్పీ ప్రదీప్తి, ఎస్సై సురేంద్ర సూచించారు.

ఎలుకల సామూహిక నిర్మూలనతో మేలు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు

మామిడికుదురు: జిల్లాలో 1.65 లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారని, ఎలుకల సామూహిక నిర్మూలనతో మేలు జరుగుతుందని జిల్లా వ్యవసాయాధికారి డి.బోసుబాబు తెలిపారు. గురువారం మొగలికుదురులో పొలాల్లో ఎలుకల మందు పెట్టే విధానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులకు అవసరమైన 20 వేల టన్నులు యూరియా అందుబాటులో ఉందన్నారు. రైతులంతా విశిష్ట నంబర్ కోసం నమోదు చేసుకోవాలని వ్యవసాయశాఖ కమిషనరేట్ డీడీ డి.వెంకటేశ్వరరావు తెలిపారు. సమావేశంలో డాట్ సెంటర్ సైంటిస్ట్ ఎం.నందకిశోర్, ఆత్మ పీడీ డి.జ్యోతిర్మయి, ఏడీఏలు ఎ.రాజశేఖర్, ఎస్‌జేవీ రామ్మోహనరావు, ఏఓ బి.మృదుల పాల్గొన్నారు.

సఖినేటిపల్లి: మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఎలుకల సామూహిక నిర్మూలనా కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు ఆయా పంచాయతీల్లో ఎలుకల నివారణ మందును సిబ్బందిచే అక్కడికక్కడే సిద్ధం చేసి, వరి సాగు రైతులకు ప్రముఖులు, ఆయా ప్రజాప్రతినిధులు పంపిణీ చేశారు. సఖినేటిపల్లిలంకలో రేవూరి ఏసు నరసింహరాజా పంపిణీ చేశారు. మండల ఏఓ పీవీ నరసింహారావు, వ్యవసాయ శాఖ సిబ్బంది, పెద్దలు పాల్గొన్నారు.

బాధితుడికి చేయూత



బాధితుడి బంధువుకు సాయం అందజేస్తున్న సేవా సంస్థ సభ్యులు

రావులపాలెం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు గురువారం రూ. 13 వేల సాయం చేశారు. రాజమహేంద్రవరానికి చెందిన వేలుగట్ల మోహన నాగసతీష్‌కు పది రోజులు క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్రమైన గాయాలు కావడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ప్రస్తుతం కోమాలోనే ఉన్నాడు. ఇప్పటి వరకూ రూ. 7 లక్షలు ఖర్చు పెట్టారు. వడ్రంగి పని చేసుకునే సతీష్ తండ్రికి ఆర్థిక స్థోమత లేక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులను సహాయం కోరారు. రావులపాలెంలో సతీష్ మేనమామ మార్గాన నాగరాజుకు సంస్థ సభ్యుల చేతుల మీదుగా రూ.13 వేలను అందజేశారు.

వైభవంగా పెద్దింట్లమ్మ గ్రామోత్సవం



పూర్ణాలంకరణలో పెద్దింట్లమ్మ

రావులపాలెం: స్థానిక భద్రమహంకాలమ్మ పుంత రోడ్డులో వేంచేసి ఉన్న పెద్దింట్లమ్మ ఆరో వార్షికోత్సవం సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు అజయ్ శర్మ బ్రహ్మత్వంలో అమ్మవారికి విశేష అభిషేకాలు, అలంకరణ చేశారు. సాయంత్రం అమ్మవారి ఊరేగింపు, జాతర గరగలతో గ్రామోత్సవం నిర్వహించారు. అలాగే సహస్రనామ పూజ వైభవంగా జరిపారు. ఈ ఏర్పాట్లను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

ముత్యాలమ్మ ఆలయ వార్షికోత్సవం

పి.గన్నవరం: ముంగండలో వేంచేసిన ముత్యాలమ్మ వారి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి. వివిధ గ్రామాలకు చెందిన వందలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అన్న సమారాధన చేశారు.

పలువురికి పరామర్శ

అయినవిల్లి: పితృ వియోగంతో బాధపడుతున్న మాగం గ్రామానికి చెందిన యడ్ల నరసింహమూర్తిని, పుత్ర వియోగంతో బాధపడుతున్న అజ్జరపు వెంకటేశ్వరరావు, మాతృమూర్తి వియోగంతో ఉన్న అడ్డగళ్ల రాంబాబును పి.గన్నవరం వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు గురువారం పరామర్శించారు. ఆయన వెంట మాగం సర్పంచ్ కాశీ వీరవెంకట సత్యనారాయణమూర్తి, సిరిపల్లి ఎంపీటీసీ సభ్యుడు యడ్ల కిరణ్‌బాబు, మడుపల్లి ఉప సర్పంచ్ పినిపే బుజ్జి, నాయకులు అజ్జరపు ఏడుకొండలు, మోకా మహేంద్ర రెడ్డి, చప్పిడి శ్రీను తదితరులు ఉన్నారు.

మధ్యాహ్న భోజనం

- కొత్తపేట జూనియర్ కళాశాలలో అన్నం, సాంబారుతో సరి
- అమలు కాని ప్రభుత్వ మెనూ



కొత్తపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న సిబ్బంది

కొత్తపేట: అంతన్నారు.. ఇంతన్నారు.. చివరికి సాంబారు అన్నంతో సరిపెట్టారు. కొత్తపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం మధ్యాహ్న భోజన పథకం అమలు తీరిది. ఇక్కడ సుమారు 90 మంది విద్యార్థులు మధ్యాహ్న భోజనానికి రాగా స్టీల్ హాట్ బాక్సుల్లో అన్నం, సాంబారు అరకొరగానే వచ్చాయి. అది చూసి అధ్యాపకులు తెల్లబోయారు. ఇది 40 మందికి కూడా సరిపోవన్నారు. సరే ముందు వచ్చిన విద్యార్థులకు ఉన్నదాన్నే వడ్డించేందుకు సిద్ధమయ్యారు. భోజనానికి రండి.. అనగా విద్యార్థులు ప్లేట్లు తీసుకువచ్చి లైన్‌లో నిల్చున్నారు. కళాశాల సహాయకురాలు అన్నం వడ్డించగా, ఒక లెక్చరర్ సాంబారు వేశారు. ఈసారి తెల్లబోవడం విద్యార్థుల వంతైంది. ఒక్క సాంబారుతో సరా! అని. ఎందుకంటే అక్కడ మరో కూర గాని, పచ్చడి గాని లేదు. కేవలం ఆ అన్నం, సాంబారు మాత్రమే ఉన్నాయి. ఈ చిత్రం 'సాక్షి' కంటపడింది. ప్రభుత్వం 'డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం' పథకాన్ని జూనియర్ కళాశాలలకు విస్తరించి గత నెల 4న ఆడంబరంగా ప్రారంభించింది. ఈ పథకం ఆరంభ శూరత్వమే తప్ప అమలు తీరులో మాత్రం చిత్తశుద్ధి లేదని తేటతెల్లమైంది. దీనిపై 'సాక్షి' ఆరా తీయగా పక్కనే ఉన్న ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఎండీఎం ఏజెన్సీ వారే ఈ కళాశాలకు కూడా మధ్యాహ్న భోజనం వండి పంపిస్తున్నారని తెలిసింది. ఆ మేరకు విద్యార్థులకు గురువారం మధ్యాహ్న భోజనం సిద్ధం చేశారు. మెనూ ప్రకారం గురువారం సాంబార్ బాత్/లెమన్ రైస్, టమోటా పచ్చడి, ఉడికించిన కోడిగుడ్డు ఇవ్వాలి. అయితే ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా బర్డ్ ఫ్లూ వ్యాప్తి, ప్రజల్లో ఆందోళన నేపథ్యంలో బుధవారం నుంచి పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో గుడ్డు వేయడం లేదు. మెనూలో ఉన్న టమోటా పచ్చడి కూడా వడ్డించ లేదు. విద్యార్థులు తప్పక ఆ సాంబారు అన్నాన్నే ఆరగించి అర్ధాకలి తీర్చుకున్నారు. అన్నం, సాంబారు సరిపోకపోవడంతో పథకాన్ని పర్యవేక్షిస్తున్న అధ్యాపకులు ప్రిన్సిపాల్ ద్వారా పక్క పాఠశాల హెచ్ఎంకు, ఎంఈఓకు తెలియజేయడంతో తిరిగి అన్నం, సాంబారు పంపించారు. ఈ భోజనంపై పలువురు విద్యార్థులను అడగ్గా ఇంటి వద్ద కూర, సాంబారు లేదా రసం, పచ్చడితో తింటామని, ఇక్కడ ఈ రోజు ఒక్క సాంబారులతో తినాల్సి వచ్చిందని వాపోయారు. ఒక్కోసారి అన్నం సరిగ్గా ఉడకలేదని, పలుకుగా ఉంటుందని విద్యార్థులతో పాటు పలువురు అధ్యాపకులు తెలిపారు.

మరోసారి పంపించారు..

కళాశాలలో మధ్యాహ్న భోజనం తీరుపై ప్రిన్సిపాల్ కె.రవి కుమార్‌ను 'సాక్షి' వివరణ కోరగా ఎండీఎం పథకం బాగానే అమలు చేస్తున్నారన్నారు. అయితే మెనూ ప్రకారం ఒక్కో రోజు చిక్కీలు రావడం లేదన్నారు. ఈరోజు అన్నం, సాంబారు తక్కువ రావడంతో ఎంఈఓ, పక్క పాఠశాల హెచ్ఎం దృష్టికి తీసుకువెళ్లామన్నారు. వారు రెండోసారి పంపించారని, దానితో విద్యార్థులందరికీ వడ్డించామని తెలిపారు.

నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యం



కొత్తపేట ప్రభుత్వ పాఠశాలలో హెచ్ఎం, ఉపాధ్యాయులతో సమీక్షిస్తున్న డీవైఈఓ రామలక్ష్మణమూర్తి

కొత్తపేట: పదో తరగతి పరీక్షల్లో విద్యార్థుల నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ప్రత్యేక ప్రణాళిక అమలు చేస్తున్నట్టు రామచంద్రపురం డీవైఈఓ పి.రామలక్ష్మణమూర్తి తెలిపారు. వచ్చే నెల 17 నుంచి పదో తరగతి పరీక్షలు జరగనున్న నేపథ్యంలో ప్రస్తుతం ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహిస్తున్న తీరు, ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహణ, పబ్లిక్ పరీక్ష కేంద్రాల పరిశీలనలో భాగంగా డీవైఈఓ గురువారం స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలను సందర్శించారు. మధ్యాహ్న భోజనం పథకం మెనూ అమలును పరిశీలించారు. అనంతరం వివిధ అంశాలపై హెచ్ఎం ఆర్.రామకృష్ణ, ఉపాధ్యాయులతో డీవైఈఓ సమీక్షించారు. పబ్లిక్ పరీక్షలంటే భయపడకుండా పిల్లల్లో మానసిక స్థైర్యాన్ని పెంపొందించే విధంగా సిద్ధం చేయాలని సూచించారు. స్టేట్ కౌన్సిల్ ఫర్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎస్‌సీఈఆర్‌టీ) ద్వారా సరఫరా చేసిన మెటీరియల్‌ను విద్యార్థులకు ఇచ్చి వారిలో ప్రతిభను పెంపొందిస్తున్నట్టు తెలిపారు. క్లస్టర్స్ తొలి సమావేశాలు ఈ నెల 15న నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

సర్వీస్ రోడ్డు నిర్మించండి



చెముడులంకలో డివైడర్ గురించి హైవే అధికారులకు వివరిస్తున్న సర్పంచ్ శ్రీనివాస్

ఆలమూరు: 216వ జాతీయ రహదారిలో చెముడులంక ప్రధాన కూడలి వద్ద డివైడర్‌ను మూసివేయడం వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సర్పంచ్ తమ్మన శ్రీనివాస్ అన్నారు. స్థానిక ప్రధాన కూడలిలోని డివైడర్‌ను పరిశీలించేందుకు గురువారం గ్రామానికి వచ్చిన హైవే అధికారులను ఆయన ప్రశ్నించారు. డివైడర్ ఏర్పాటు కోరుతూ ఇప్పటికే కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్, కొత్తపేట ఆర్డీఓ పి.శ్రీకర్, హైవే పీడీ సురేంద్రనాథ్‌కు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. డివైడర్ లేకపోవడంతో ఇరువైపులా రెండు కిలోమీటర్ల మేర వెళ్లి రహదారిని దాటాల్సి వస్తుందని తెలిపారు. ప్రజల సౌకర్యార్థం డివైడర్ ఏర్పాటు చేయాలని, లేకుంటే సర్వీస్ రోడ్డు నిర్మించాలని హైవే అధికారులకు విజ్ఞప్తి చేశారు. లేకుంటే శాంతియుతంగా న్యాయ పోరాటం చేస్తామని హెచ్చరించారు. వైఎస్సార్ సీపీ నాయకులు దొండపాటి చంటి, అడబాల వీర్రాజు, బుద్దిగ వీరవెంకట్రావు, అడబాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అవార్డు అందుకోవడం పూర్వజన్మ సుకృతం



ముకేందరస్వామిని సత్కరిస్తున్న హరే శ్రీనివాస భక్త బృంద మహిళలు

ఆలమూరు: కలియుగ దైవం శ్రీవేంకటేశ్వరస్వామి పాదాల చెంతన పీఠాధిపతుల చేతుల మీదుగా పురంధర అనుగ్రహ ప్రశస్త పురస్కారం అందుకోవడం తన పూర్వజన్మ సుకృతమని ఆలయ వ్యవస్థాపకుడు, ఆధ్యాత్మికవేత్త ఎం.ముకేందరస్వామి వ్యాఖ్యానించారు. ఆలమూరులోని అయ్యప్పస్వామి ఆలయ ఆవరణలో ఆధ్యాత్మిక వేత్త ముకేందరస్వామికి గురువారం ఘన సత్కారం జరిగింది. ఆలయ కమిటీ అధ్యక్షుడు వంటిపల్లి సతీష్ ఆధ్వర్యంలో హరే శ్రీనివాస భక్త భజన బృంద మహిళలు గురువారం సత్కరించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ ఈదల నల్లబాబు, వంటిపల్లి సతీష్ తదితర నాయకులు స్వామిని సన్మానించారు. దీనికి టీడీపీ నేత బండారు సంజీవ్, వ్యాపారవేత్త వంటిపల్లి పాపారావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.